క్లుప్తంగా

వాకర్స్ అసోసియేషన్ వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేసుకుంటున్న డీఎఫ్ఓ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక నగరవనంలో చిత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి జెండా వందనం చేసి ప్రారంభించారు. పలువురికి బీపీ, షుగర్, దంత పరీక్షలను వైద్యులు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలను డీఎఫ్ఓ కొనియాడారు. ఎఫ్ఆర్వో థామస్, అసోసియేషన్ రీజనల్ కౌన్సిలర్ ప్రతాప్, గౌరవాధ్యక్షుడు రవి, అధ్యక్షుడు పార్థసారథి, కార్యదర్శి సురేంద్రబాబు, కోశాధికారి బాలాజీరావు, నేత మహ్మద్‌బాషా పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకుడికి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న బాబు

కాణిపాకం: కాణిపాకానికి చెందిన డి.బాబు ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా హైదరాబాద్‌లో గురువారం ఆ సంస్థ అధినేత గంప నాగేశ్వరరావు, నటుడు కేవీ ప్రదీప్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. అక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న ఈయన 30 రోజులపాటు శిక్షణ పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాస తరగతులను అందిస్తామని బాబు పేర్కొన్నారు.

దర్గాలో గంథం వేడుకలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని దర్గాలో గురువారం రాత్రి గంథం వేడుకలను ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనలకు చిత్తూరు నలుమూలల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముస్లింలతో దర్గా కిటకిటలాడింది.

ఉత్తమ సేవలకు సత్కారం



మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న వీహెచ్ఏ చైతన్య

ఐరాల: మండలంలోని కామినాయనపల్లె సచివాలయంలో వీహెచ్ఏగా విధులు నిర్వహిస్తున్న చైతన్య ఉద్యానశాఖ తరపున జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలకు ఎంపికయ్యారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ సుమిత్ కుమార్ చేతులమీదుగా ఉత్తమ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గురువారం చిత్తూరులో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

సీఐ, ఎస్ఐలకు అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ రామ్మోహన్, సీఐ రవిశంకర్‌రెడ్డి

గుడిపాల: చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, గుడిపాల ఎస్ఐ రామ్మోహన్‌లకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకుగాను అవార్డును అందుకున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ద్వారా అవార్డును చిత్తూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అందుకున్నారు.

శుద్ధజలం ఇవ్వడమే లక్ష్యం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తవణంపల్లె: గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం శుద్ధ జలం అందించడానికి కృషి చేస్తున్నట్లు దాత అర్ధగిరి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దిగుమోదాలపల్లె పంచాయతీ జి.వడ్డిపల్లెలో దాత సుగుణాకర్‌రెడ్డి ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగు నీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దీని కోసం జిల్లా కలెక్టర్ రూ.11 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. దాత సుగుణాకర్‌రెడ్డి స్ఫూర్తితో గ్రామీణ పేదల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. సర్పంచులు రవిచంద్రరెడ్డి, సతీష్‌రెడ్డి, చలపతి, వెంకటేశ్వరచౌదరి, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

మేరా భారత్ మహాన్



చిత్తూరు: కోర్టు ఆవరణలో జెండా వందనం చేస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల వ్యాప్తంగా స్వాతంత్ర్య దిన సంబరాలు మిన్నంటాయి. గురువారం ఉదయం వాడవాడలా జాతీయజెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



చిన్నవెంకటంపల్లె ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవంలో బాలలు, టీచర్లు



చిత్తూరు: సిబ్బందికి స్వీట్లు పంచుతున్న ఎస్పీ మణికంఠ

- వాడవాడలా జెండా పండుగ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు కోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. న్యాయమూర్తులు శాంతి, శ్రీదేవి, రమేష్, వెన్నెల, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో చిత్తూరు ఎస్పీ మణికంఠ జెండా ఆవిష్కరించారు. ఆయన సతీమణి హర్షిత, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌నాయుడు పాల్గొని పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్, పాదరక్షలు, ఇతర ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. అలాగే గాంధీ విగ్రహ కూడలిలో ఎమ్మెల్యే జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్పొరేషన్ కమిషనర్ అరుణ, అధికారులు రామకృష్ణుడు, గోపాలకృష్ణవర్మ, అనిల్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. చిత్తూరు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బార్ కార్యాలయ ప్రాంగణంలో ఆ సంఘ ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్‌యాదవ్ జెండా ఎగరేశారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఉపేంద్ర, సింగిల్‌విండో కార్యాలయం వద్ద సింగిల్‌విండో సీఈఓ పట్టాభి, నరహరిపేట జెడ్పీ హైస్కూల్ వద్ద హెచ్‌ఎం ఖాతుంబి, ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ గణపతి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ రామ్మోహన్, బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ జాతీయజెండాను ఎగరేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్‌రెడ్డి, జెడ్పీటీసీ భారతి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ మహనీయుల చిత్రపటాలకు పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్, పీహెచ్‌సీలో డాక్టర్ ప్రియాంక జెండా ఆవిష్కరించారు. సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటుకున్నారు. పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు.

ముువ్వన్నెల జెండా రెపరెపలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి మూడు రంగుల జెండాను ఎగురవేశారు. జెండాకు వందనం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ ఎంఎస్.బాబునాయుడు, ఎంపీపీ గీతా జెండా ఎగురవేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ, ఎంఈఓ సెల్వరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపత్ పాల్గొన్నారు. తాళంబేడు సచివాలయం వద్ద సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి జెండా ఎగురవేసి మహాత్ముల చిత్రపటాలకు నివాళులర్పించారు. కాణిపాకంలో ఇన్‌చార్జ్ ఈఓ వాణి జాతీయ జెండాను ఎగురవేశారు.

మహనీయుల త్యాగఫలం స్వాతంత్ర్యం

బంగారుపాళెం: మహనీయుల త్యాగఫలం భారత స్వాతంత్ర్య దినమని ఎంపీపీ అమరావతి అన్నారు. భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శివశంకర్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ పాల్గొని ప్రసంగించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంఆర్‌సీ వద్ద ఎంఈఓ నాగేశ్వర్‌రావు, పోలీస్ స్టేషన్‌లో సీఐ లక్ష్మయ్య, ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ శిరీష, తుంబకుప్పం పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వందన త్రిపాఠి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజేంద్రన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బంగారుపాళెం దళితవాడలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్యదినోత్సవాన్ని నిర్వహించారు.

మహాత్ముల త్యాగాలను మరువరాదు

ఐరాల: దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముల త్యాగాలను ఎప్పటికీ మరువరాదని తహసీల్దార్ కె.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నాగరాజు, వ్యవసాయ, ఎంఈఓ కార్యాలయాలు, పీహెచ్‌సీలు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయం, సచివాలయాల్లో జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు, ఏఓ వరలక్ష్మి, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



చిత్తూరు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద..



బంగారుపాళెం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద..



గుడిపాల: తహసీల్దార్ కార్యాలయంలో..



వసంతాపురం సచివాలయం వద్ద..



తాళంబేడు సచివాలయం వద్ద జెండా వందనం



మహాత్ముల చిత్రపటాలకు నివాళి



బంగారుపాళెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా వందనం,



ఐరాల: తహసీల్దార్ కార్యాలయంలో..



బంగారుపాళెం: దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



చిత్తూరు: ట్రాన్స్‌కో కార్యాలయంలో..

మళ్లీ అధికారంలోకి వస్తాం



జెండా వందనం చేస్తున్న విజయానందరెడ్డి

- విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి జాతీయ జెండాను ఎగరేశారు. అనంతరం పార్టీ క్యాడర్‌తో సమావేశమయ్యారు. ఎవరు బాధపడొద్దు మళ్లీ అధికారంలోకి వస్తామని భరోసానిచ్చారు. ఇటీవల పలువురు ఎన్నో బాధలు పడ్డారన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అందరూ ధైర్యంగా ఉండాలన్నారు. జగనన్న మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి, న్యాయవిభాగం అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సరళామేరీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నేతలు, కార్పొరేటర్లు కేపీ శ్రీధర్, అను, మధురెడ్డి, హరిణిరెడ్డి, భాగ్యలక్ష్మి, రామ్‌గణేష్, శేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

బైరెడ్డిపల్లె: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి అన్నారు. గురువారం బైరెడ్డిపల్లెకు చెందిన శేషేగౌడు ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన విషయం తెలుసుకొని ఆయన నేరుగా వెళ్లి పరిశీలించారు. బైరెడ్డిపల్లెలో గత రెండు నెలలుగా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు పాల్పడ్డారని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులను కాల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు ఇలాగే కొనసాగితే తగిన గుణపాఠం చెప్పాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. సర్పంచులు రమణారెడ్డి, బాలక్రిష్ణగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

రోబోటిక్ టెక్నాలజీతో మోకాళ్ల శస్త్ర చికిత్స

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతంలోని అరగొండ అపోలో ఆస్పత్రిలో రాయలసీమలోనే మొట్టమొదటి సారిగా రోబోటిక్ టెక్నాలజీతో మోకాళ్లకి శస్త్ర చికిత్సలు చేసినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ్‌కిషోర్‌రెడ్డి తెలిపారు. అరగొండ అపోలో హాస్పిటల్‌లో ఆధునిక పరిజ్ఞానంతో మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న నలుగురికి అత్యాధునిక పరికరాలతో రోబోటిక్ టెక్నాలజీతో విజయవంతంగా శస్త్రచికిత్స చేసినట్లు వెల్లడించారు. అపోలో హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి నేతృత్వంలో గ్రామీణ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడానికి తక్కువ వ్యయంతో అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్‌తోపాటు ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ కునాల్‌పటేల్, డాక్టర్ శ్రీధర్, అరగొండ అపోలో హాస్పిటల్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



అరగొండ అపోలో ఆస్పత్రిలో రోబోటిక్ టెక్నాలజీతో చేస్తున్న మోకాళ్ల శస్త్ర చికిత్స



ఇలా చేయొద్దు: జాగ్రత్తలు తీసుకోకుండా మందును పిచికారీ చేస్తున్న రైతు



ఇలా చేయాలి: సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేస్తున్న రైతు

జాగ్రత్తలే శ్రీరామరక్ష

- పురుగు మందుల పిచికారీలో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు పాటించకుంటే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం
- వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి

చిత్తూరు అగ్రికల్చర్: పంట పొలాల్లో తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం. పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలే శ్రీరామరక్ష అని వ్యవసాయశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. ఏటా జిల్లా వ్యాప్తంగా రైతులు అన్ని రకాల పంటలను 1.30 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. అయితే సాగయ్యే పంటలపై తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంటోంది. వీటిని సకాలంలో నివారించకపోతే పంట దిగుబడులపై ప్రభావం పడుతుంది. ఎప్పటికప్పుడు చీడ, పీడలు సోకకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. ఇందుకోసం పంటలకు వివిధ రకాల పురుగు మందులను పంటలపై పిచికారీ చేస్తారు. సాధారణంగా రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే పొలాల్లో మందులను పిచికారీ చేస్తుంటారు. పంటల సంరక్షణకు అధునాతనంగా అందుబాటులోకి వచ్చిన పురుగుల మందులను రైతులు విరివిగా వాడుతున్నారు. వీటి పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పెనుప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో కొంతమంది అవగాహన లేమితో మందులను పిచికారీ చేసేటప్పుడు కనీస జాగ్రత్తలను పాటించడం లేదు. దీనివల్ల విషప్రభావానికి గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు సేఫ్టీ సూట్ లేదా రైతులు శరీరం అంతా కప్పబడేలా దుస్తులతో పాటు నోటికి వస్త్రం మాస్కులు ధరించాలి.

మందుల ప్రభావం ఇలా..

పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రసాయనాల ప్రభావం మూడు రకాలుగా ఉంటుంది. ఈ మందుల నుంచి వెలువడే విషవాయువులను ముక్కు నుంచి పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. పురుగు మందు మోతాదు ఎక్కువైనప్పుడు ఒక్కోసారి విషవాయువు చర్మం ద్వారా శరీరంలోకి ప్రవేశించే వీలుంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే ఈ తీవ్రత మరింత అధికంగా ఉంటుంది. పురుగు మందులు పిచికారీ చేసిన తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కోకపోవడంవల్ల తినే ఆహార పదార్థాలతో నోటి ద్వారా విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. పిచికారీ చేస్తూ పొగ తాగినా విషవాయువు రూపంలో శరీరంలోకి వెళ్లే ప్రమాదముంది.

చికిత్స విధానం..

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు నీటితో శుభ్రం చేయాలి. ఒకవేళ కంట్లో పడితే మంచినీటితో కడగాలి. పురుగు మందును ముక్కుతో పీల్చి ప్రమాదానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు ఎక్కువగా తగిలే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటే కృత్రిమ శ్వాసను అందించేలా ఏర్పాటు చేయాలి. వీలైనంత త్వరగా సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించాలి. క్రిమి సంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళ్లినప్పుడు వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడిని తగినంత మోతాదులో కలిపి తాగించాలి. కడుపు ఖాళీ అయ్యే వరకు అలా తాగిస్తూనే ఉండాలి. అనంతరం వైద్యుడి వద్దకు తీసుకు వెళ్లి చికిత్స అందించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..



రైతులు పంట పొలాల్లో పురుగు మందుల పిచికారీ చేసే సమయంలో కనీస జాగ్రత్తలు పాటించాలి. వీలైనంత మేరకు సేఫ్టీ సూట్ ధరించడం, లేకుంటే శరీరానికి, ముక్కు, నోటికి వస్త్రాలు కట్టుకోవాలి. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలి. ఆరోగ్య సమస్య తలెత్తిన సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు కూడా తెలియజేయాలి. మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

–ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ అధికారి

తిరుమలకు పాదయాత్ర

బైరెడ్డిపల్లె: మండలంలోని కుప్పనపల్లె, పాతపేట గ్రామానికి చెందిన 50 మంది రైతులు గురువారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఉదయం కడపనత్తం శ్రీనల్లగుండ్రయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆనవాయితీగా శ్రావణమాసంలో తిరుమలకు పాదయాత్ర వెళ్తున్నామన్నారు. వర్షాలు బాగా పడాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని స్వామిని వేడుకోనున్నట్లు తెలిపారు.



పాదయాత్రలో కుప్పనపల్లె, పాతపేట వాసులు

మూఢ విశ్వాసాలను రూపుమాపుదాం

పలమనేరు: మూఢ విశ్వాసాలను రూపుమాపడమే జనవిజ్ఞానం పత్రిక లక్ష్యమని పలమనేరు రచయితల సంఘ నాయకుడు బాలాజి తెలిపారు. జనవిజ్ఞానం సంచికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మూఢ విశ్వాసాలపై అవగాహన పెంచేందుకు పత్రికను ప్రారంభించామన్నారు.